క్లుప్తంగా

ఎస్పీని కలసిన ఈర లక్కప్ప



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మంగళవారం ఎస్పీ మాధవరెడ్డిని మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. నియోజకవర్గంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకారం అందించాలని ఎస్పీ కోరినట్లు ఈర లక్కప్ప తెలిపారు.

యువకుడికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తన ద్విచక్ర వాహనంలో సోమందేపల్లికి వెళ్తుండగా అదుపు తప్పి ద్విచక్ర వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. దీంతో గంగాధర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

9న చేనేత జిల్లా మహాసభలు



పోస్టర్లు విడుదలచేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: చేనేత జిల్లా మహాసభలు ఫిబ్రవరి 9న మండల కేంద్రమైన సోమందేపల్లిలో నిర్వహించనున్నట్లు చేనేత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షుడు బాలస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. 11 రకాల చేనేత రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేసి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, రవీంద్ర, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గోరంట్ల: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రమీల మాట్లాడుతూ మండలాభివృద్ధికి ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రఘునాథగుప్తా, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



అలుపనపల్లిలో ఐఎఫ్‌పీ ప్యానల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: నాడు–నేడు రెండో విడత కింద నిధులు మంజూరైన పాఠశాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో నాడు–నేడు రెండో విడత మంజూరైన 32 పాఠశాలల హెచ్‌ఎంలతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని ఆలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ బోర్డును పరిశీలించారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



మృతుడు రాజశేఖర్ (ఫైల్)

పావగడ: తాలూకాలోని ఎస్ హొసహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ (52) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజశేఖర్ మృతికి బీఈఓ ఇంద్రాణి, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు



మడకశిరలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

హిందూపురం: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకునేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మాగాంధీ కలలను సాకారం చేస్తున్నారని కొనియాడారు. మరోవైపు హిందూపురం మున్సిపల్ ఆఫీసు వద్ద చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తదతరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రొద్దం: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గాంధీజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారన్నారు.

మడకశిర: పట్టణంలోని సాయినగర్ వార్డు సచివాలయంలో ఉద్యోగులు మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరోవైపు పట్టణంలోని గాంధీ విగ్రహానికి మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుకొండ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజకుళ్లాయప్ప సాయినగర్ సచివాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుభద్ర, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, స్థానిక నాయకులు నాగేంద్ర, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ పోటీల్లో ప్రతిభ



లేపాక్షి: క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



చిలమత్తూరు: ప్రతిభ చూపిన టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థినులు

చిలమత్తూరు: ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీల్లో టేకులోడు క్రాస్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ శ్యామ్ భూపాల్‌రెడ్డి తెలిపారు. హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో నిర్వహించిన పోటీల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో నియోజకవర్గస్థాయిలో ప్రథమ బహుమతులు సాధించారన్నారు. నాలుగు క్రీడల్లో మొత్తం 1.10 లక్షల పారితోషికం సాధించారని హర్షం వ్యక్తం చేశారు.

హిందూపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగానే మంగళవారం నియోజకవర్గస్థాయి పోటీలు హిందూపురంలో జరిగాయి. మహిళల షటిల్ బ్యాడ్మింటన్‌లో మొదటి మ్యాచ్‌లో హిందూపురం, కిరికెర టీంలు పోటీ పడ్డాయి. మ్యాచ్‌లో గెలుపొందిన హిందూపురం జట్టు చిలమత్తూరుతో తలపడి విజేతగా నిలిచింది. దీంతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది.

లేపాక్షి: నియోజకవర్గస్థాయి ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీల్లో లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. బాలిక విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ద్వితీయస్థానం, కబడ్డీ పోటీల్లో తృతీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు.

మారెమ్మ తల్లీ కరుణించు..



గుడి వద్ద ఉరుములు మోగిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని కావలగేరి వీధిలో కావలగేరి మారెమ్మ, నసనకోట ముత్యాలమ్మ జాతరోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు మారెమ్మ గుడికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మారెమ్మ పూజారి మూర్తి, ముత్యాలమ్మ పూజారి ముత్యాలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బీసీ వసతి గృహం తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సీ.రాజకుళ్లాయప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భోజనాలు, హాజరు రికార్డులను పరిశీలించారు. వసతి గృహ సమస్యలను వార్డెన్ సికిందర్‌బాషాను అడిగి తెలుసుకున్నారు.

‘ఆరోగ్య సురక్ష’ ప్రజలకు శ్రీరామ రక్ష



పెనుకొండ మండలం మావటూరులో ఆరోగ్య సురక్ష కార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

సాక్షిబృందం: ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామ రక్ష లాంటిదని వైద్యులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆరోగ్య సురక్ష శిబిరాలు పెనుకొండ మండలం మావటూరు, అమరాపురం మండలంలోని గుణేహళ్లి, మడకశిర మండలం కదిరేపల్లి, అగళి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన ప్రజలకు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.



అమరాపురం: గుణేహళ్లిలో వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్



అగళి: వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



మడకశిర మండలం కదిరేపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

హిందూపురం టౌన్: ‘విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా తమ ప్రతిభను చాటాలి. పలువురికి ఉపాధి కల్పించేదిశగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి’ అని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన మంగళవారం కళాశాల ప్రాంగణంలో డిగ్రీ విద్యార్థులకు ఆవిష్కరణ, వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ ప్రస్తుతం స్టార్టప్ అవకాశాలు చాలా విస్తృతంగా ఉన్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ ఇంక్యుబేషన్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి, రిసోర్స్ పర్సన్ జ్యోతి, హసీనా పరిశ్రమల స్థాపన, అనుమతులు, పెట్టుబడి అవకాశాలు తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, కామర్స్ అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

పరిగి: మండల కేంద్రమైన పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరెడ్డి మాట్లాడుతూ మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందన్నారు. ప్రధానంగా స్పర్శ లేని మచ్చలు ఏర్పడటంతో పాటు దేహంలో వివిధ ప్రాంతాల్లో నొప్పి లేని బొడిపెలు వస్తాయన్నారు. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో కుష్టు నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నివారణపై కృషి చేస్తామని సిబ్బందితో పాటు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, ప్రజలు పాల్గొన్నారు.

అగళి: మండలంలో కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ శివానంద, సూపర్ వైజర్ నర్సారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తక్షణమే ప్రభుత్వాస్పత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలన్నారు. రోగులకు ఉచితంగా మందులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పరిగి: ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

రొద్దం: అవగాహనతో కుష్టు వ్యాధి నివారించవచ్చని డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ లోచెర్ల కుష్టు వ్యాధి నివారణపై డీడీఓ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వైదులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ లోచెర్ల, బూచెర్ల సర్పంచులు గంగాధర్, సోమిరెడ్డి, ఏపీఎంఓ రమణ, సూపర్‌వైజర్ గిరనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

2న మడకశిరలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

మడకశిర: నియోజకవర్గంలో ఫిబ్రవరి 2న (శుక్రవారం) మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత పీఏ చంద్రహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఉదయం10 గంటలకు అగళి, 11.30 గంటలకు రొళ్ల, మధ్యాహ్నం 12.30 గంటలకు గుడిబండ, మధ్యాహ్నం 3 గంటలకు అమరాపురం, సాయంత్రం 4.30 గంటలకు మడకశిరలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మండల, జేసీఎస్ కన్వీనర్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులతో సమావేశం అవుతారన్నారు.

వైఎస్సార్‌సీపీ పరిశీలకుడి పర్యటన రేపు

మడకశిర: నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు అశోక్‌కుమార్ పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫిబ్రవరి 2న ఐదు మండలాల్లో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించడానికి తాను పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల: మండల పరిధిలోని గడ్డం తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివనాయక్ సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి మంగళవారం శివనాయక్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

హిందూపురం: హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ మీట్ జరిగింది. పలువురు కౌన్సిలర్లు వివిధ సమస్యలపై తమ నిరసన తెలియజేశారు. గందరగోళ పరిస్థితుల మధ్య అజెండా మొదలవకుండనే మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశాన్ని వాయిదా వేశారు.

ప్రజాప్రతినిధులను గౌరవించండి

లేపాక్షి: ప్రజల చేత ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అధికారులు గౌరవించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్రబాబు తహసీల్దార్ బాబుకు తెలియజేశారు. సోమవారం ఉదయం శిరివరం గ్రామ సర్పంచ్ నేత్రావతి ఒక సమస్యపై తహసీల్దార్ కార్యాలయంకు వస్తే కనీస మర్యాద కూడా ఇవ్వలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

కల్లూరులో సివిల్ రైట్స్ డే

లేపాక్షి: మండలంలోని కల్లూరు ఎస్సీ కాలనీలోని దొండమ్మ దేవాలయం వద్ద మంగళవారం ఉదయం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ అంటరానితనం, కులవివక్ష తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసుంధర, వైస్ ఎంపీపీ లీలావతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, పంచాయితీ కార్యదర్శి–2 కవిత, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం



బూచేపల్లిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న శాంతమ్మ, చరణ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

గోరంట్ల: ‘పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలి. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలిచి మరోసారి సీఎంగా చేసుకుందాం’ అని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పుట్టగుండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, పుట్టగుండ్లపల్లి ఎస్సీ కాలనీ, గుంతపల్లి గ్రామల్లో మంగళవారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి పేదల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో పత్రికలు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని విమర్శించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆరు వందకు పైగా హామీలిచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. అయితే సీఎం జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారని కొనియాడారు. అనంతరం బూచేపల్లిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గుంతపల్లి గ్రామంలో ప్రతి ఇంటికీ నీటి కొళాయి ఏర్పాటు పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచ్ నార్పిరెడ్డి, ఎంపీటీసీ ఓబుళరెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, స్థానిక నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్, రాజారెడ్డి, అశోక్‌రెడ్డి, రాఘవేంద్ర, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

హిందూపురం: హిందూపురం పార్లమెంట్ ప్రజలందరికీ అందుబాటులో అంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బి.శాంతమ్మ అన్నారు. మంగళవారం పైపల్లెసర్లోడ్డులోని బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరసేవ సంఘం మహిళలు, స్థానికులు శాంతమ్మను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

రొళ్ల: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలతో పాటు ఇతరాత్ర రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని పరిచయం చేసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ–సర్వీసెస్ పై ఆరా తీశారు. రైతులు ఇబ్బంది పడకుండా డైక్లాట్‌తో పాటు సర్వే సబ్ డివిజన్ ఆధారంగా పాసు పుస్తకాలను మంజూరు చేయాలన్నారు. మ్యూటేషన్లు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు.

పైప్‌లైన్ పరిశీలన

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌ను మంగళవారం అధికారులు పరిశీలించారు. నీటి సమస్య లేకుండా నూతనంగా బోరు వేయించారు. ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ సంతోష్‌గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, కాంట్రాక్టర్ రాము పాల్గొన్నారు.

జాతర పోస్టర్ల విడుదల

అమరాపురం: చోళమాంబదేవి జాతర పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ విడుదల చేశారు. 102 సంవత్సరాల తరువాత పెద్ద జాతర ఉత్సవాలను నిర్వహించడానికి ఐదు గ్రామాల పెద్దలు, భక్తులు, గౌడ శానుబోగ, యాజమానులు, గొంచికార్లు నిర్ణయించారు. దీంతో ఫిబ్రవరి 10 నుంచి 15వ తేదీ వరకూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా వాల్ పోస్టర్లను విడుదల చేశారు.